క్లుప్తంగా

నేడు తాగునీటి దినోత్సవం

దామెర : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు (ఆదివారం) తాగునీటి పండుగను నిర్వహించనున్నట్లు మిషన్ భగీరథ డివిజనల్ ఇంజనీర్ (డీఈ) శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సింగరాజుపల్లిలోని మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్ వద్ద నేడు ఉదయం 10 గంటలకు నియోజకవర్గ స్థాయి మంచినీళ్ల పండుగను జరుపుకోనున్నట్లు పేర్కొన్నారు. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నట్లు వెల్లడించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రేపు ఈజీఎస్ ఓపెన్ ఫోరం

శాయంపేట : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీపై రేపు (సోమవారం) ఓపెన్ ఫోరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో 2021 ఫిబ్రవరి 1 నుంచి 2023 మార్చి 31 వరకు చేపట్టిన పనులపై 14వ విడత సామాజిక తనిఖీ బృందాలు ఈనెల 9 నుండి 18 వరకు తనిఖీలు నిర్వహించి గ్రామ సభలు పూర్తి చేసి తుది నివేదికను సమర్పించడానికి ఈనెల 19న ఉదయం 10.30 గంటలకు మండలస్థాయి ప్రజావేదిక ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజావేదికకు అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నాలని కోరారు.

'లక్ష' దరఖాస్తు గడువు పొడిగించాలి

శాయంపేట : బీసీ కులాల వృత్తిదారులు లక్ష రూపాయల రుణం కోసం దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించాలని విశ్వబ్రహ్మణ సంఘం మండల అధ్యక్షుడు సలేంద్ర రవీంద్రచారి శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 20న గడువు ముగియనుండగా కుల, ఆదాయం ధ్రువీకరణ పత్రాల కోసం ఇంకా వందలాది మంది పేదలు మీ సేవ కేంద్రాల, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు.

డాక్టర్ విజయలక్ష్మికి సన్మానం



హన్మకొండ: బీజేపీ నాయకురాలు డాక్టర్ టి.విజయలక్ష్మిని జమ్మూ కశ్మీర్ మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ నిర్మల్‌సింగ్ సన్మానించారు. పార్లమెంట్ ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా హనుమకొండ హంటర్‌రోడ్డులోని వేద బాంక్వెట్ హాల్‌లో సీనియర్ కార్యకర్తలకు సన్మాన కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా విజయలక్ష్మిని అభినందించారు.

ఎస్సీ ఉపకులాలకు ఆరు స్థానాలు ఇవ్వాలి

నయీంనగర్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్సీ ఉపకులాలకు ఆరు స్థానాలు కేటాయించాలని, దళితబంధు పథకంలో 40శాతం కేటాయించాలని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేశం మోచి డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 22లక్షల జనాభా కలిగి దళితుల్లో 34శాతం ఉన్న 57 ఎస్సీ ఉపకులాలు స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచినా ఈనాటికి రాజకీయ అధికారం పొందలేదని వాపోయారు. ప్రభుత్వ పథకాల్లో ఎస్సీ ఉపకులాలు తీవ్ర అన్యాయానికి గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బుచ్చన్న, లక్ష్మీ నర్సయ్య, స్వామి, శరత్, చిందు, చిరంజీవి, చందు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న చేనేత, హస్తకళా ప్రదర్శన



హన్మకొండ అర్బన్: నిట్ సమీపంలోని తారా గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కళాసిల్క్ చేనేత హస్తకళా ప్రదర్శన సందర్శకులను కట్టి పడేస్తోంది. సంప్రదాయ వస్త్రాలతో పాటు ఫ్యాషన్ ప్రపంచానికి తగిన రీతిలో వస్త్రాలు అందుబాటులో ఉన్నాయి. దేశంలోని పలు ప్రాంతాల్లో పేరెన్నికగల కళాకారులు తయారు చేసి ఉత్పత్తులు ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. స్కిల్, కాటన్, మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్పూర్, కాంతారా వర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్ చీరలు మగువల మదిని దోచేస్తున్నాయి. వాటితోపాటు వన్‌గ్రాం గోల్డ్ ఆభరణాలు ఉన్నాయి. ప్రదర్శన వారంపాటు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

బీఆర్ఎస్ హయాంలోనే గిరిజనాభివృద్ధి

● వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి



శాయంపేట : మాట్లాడుతున్న గండ్ర జ్యోతి

శాయంపేట : బీఆర్ఎస్ హయాంలోనే గిరిజనాభివృద్ధి జరుగుతోందని, తండాలు గ్రామ పంచాయతీలుగా ఉన్నతీకరించబడ్డాయని వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని సూర్యనాయక్‌తండాలో శనివారం నిర్వహించిన గిరిజనోత్సవాన్ని ఆమె ముఖ్యఅతిథిగా హాజరై సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్‌పర్సన్ జ్యోతి మాట్లాడారు. సమైక్య పాలనలో తెలంగాణ అభివృద్ధికి నోచుకోలేదని చెప్పారు. సీఎంగా కేసీఆర్ బాధ్యతలు చేపట్టాక తండాలను గ్రామ పంచాయతీలుగా ఉన్నతీకరించి ప్రత్యేక నిధులతో అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీలో 29 మంది గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ లత, సర్పంచ్ కందగట్ల రవి, ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్, పీహెచ్‌సీ వైద్యుడు సాయి కృష్ణ, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు గాజె రాజేందర్, ఎంపీటీసీలు, ఆశ వర్కర్లు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని వీర్లగడ్డ తండాలో నిర్వహించిన గిరిజనోత్సవాలకు ముఖ్యతిథిగా ఎంపీపీ జక్కుల అనిత హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ శ్రీనివాస్‌కుమార్, డీపీఓ జగదీశ్వర్, డీపీఆర్‌ఓ లక్ష్మణ్, జెడ్పీటీసీ వంగ రవీందర్, సర్పంచ్ రాజిరెడ్డి, ఎంపీటీసీ లలిత, తహసీల్దార్ హరికృష్ణ, ఎంపీడీఓ భాస్కర్ పాల్గొన్నారు.



ఎల్కతుర్తి : ఉత్సవాల్లో ఎంపీపీ, డీఆర్‌డీఓ

ధర్మసాగర్ (వేలేరు) : మండలంలోని లోక్యాతండా, చింతల్‌తండా, బండతండా గ్రామాల్లో నిర్వహించిన గిరిజనోత్సవాలకు జెడ్పీటీసీ చాడ సరిత హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వాలు గిరిజనులకు చేసిందేమి లేదని చెప్పారు. సీఎం కేసీఆర్ తండాల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. అనంతరం ఏటూరునాగారం ఐటీడీఏ ద్వారా మంజూరైన రూ.20 లక్షల వ్యయంతో చేపట్టిన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. బండతండాలో పంచాయతీ భవనానికి భూమిపూజ చేస్తున్న క్రమంలో తమ పట్టా భూమిలో పంచాయతీ భవనం ఎలా నిర్మిస్తారంటూ స్థానికులు అభ్యంతరం తెలపడంతో రోడ్డు పక్కన శిలాఫలకం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ వెంకటేశ్వర్‌రావు, సర్పంచ్‌లు మురావత్ అనురాధ, మాలోతు రాంచందర్, మాలోతు సంపత్, ఎంపీడీఓ లక్ష్మీ ప్రసన్న, ఎంపీఓ విమల, ఆర్ఐ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



ధర్మసాగర్ : మాట్లాడుతున్న జెడ్పీటీసీ సరిత

పేదలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలి

ధర్మసాగర్ : పేదలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం (వ్యకాస) జిల్లా ఉపాధ్యక్షుడు, మండల కార్యదర్శి చిలుక రాఘవులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. మండలంలోని ముప్పారం గ్రామంలో ఆ సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడు వల్లెపు రమేశ్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశానికి రాఘవులు హాజరై మాట్లాడారు. దశాబ్ది ఉత్సవాల పేరిట ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ప్రజలకు సూచించారు. ప్రభుత్వం మండలంలోని పేదలంరదికీ ఇళ్ల స్థలాలు కేటాయించి రూ.3 లక్షలు చొప్పున ఇల్లు కట్టుకునేందుకు సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈనెల 19న తలపెట్టిన తహసీల్దార్ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని శ్రేణులను, ప్రజలను కోరారు. సమావేశంలో నాయకులు ఆరూరి భాగ్య, సల్లూరి ప్రమీల, మోడం రాజేశ్వరి, బత్తిని లావణ్య, కందుకూరి రేణుక, మోడం కవిత, కందుకూరి సుగుణ, కర్నె దీప, కందుకూరి ప్రభాకర్, మేకల సరిత, కందుకూరి నాగులు, మేకల తిరుమల, కందుకూరి జయరాజ్, కమలాకర్, బరిగెల ఉపేంద్ర పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



పరకాల : చెక్కు అందిస్తున్న మేనేజర్ శివకుమార్

పరకాల : రేగొండ మండలంలోని రూపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మంచిపెళ్లి భిక్షపతి ఇటీవల మృతి చెందగా స్టార్ యూనియన్ డైచి లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంక్ స్థానిక బ్రాంచ్ మేనేజర్ శివకుమార్ శనివారం రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ శివకుమార్ మాట్లాడారు. భిక్షపతి ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసే వాడని తెలిపారు. అతడు ప్రధాన మంత్రి జీవన్ బీమా యోజన కలిగి ఉండడంతో రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బీమా మంజూరైందని చెప్పారు. బ్యాంక్ ఖాతాదారులు ప్రధాన మంత్రి జీవన్ బీమా యోజన, జీవన్ సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాల్లో చేరి కుటుంబాలకు సాంత్వన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు శరత్ చంద్ర, లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.



ఆత్మకూరు : డిపాజిట్ పత్రాలు అందిస్తున్న మిత్రులు

బాల్యమిత్రుల చేయూత

ఆత్మకూరు : మండల కేంద్రానికి చెందిన తోట నారాయణస్వామి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి నారాయణస్వామి బాల్యమిత్రులు చేయూత అందించారు. నారాయణస్వామితో కలిసి 1996–97 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న అతడి మిత్రులు శనివారం బాధిత కుటుంబాన్ని కలిసి పరామర్శించారు. తొలుత నారాయణస్వామి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం నారాయణస్వామి కూతురు శరణ్య పేరుతో బ్యాంకులో డిపాజిట్ చేసిన రూ.42 వేల 500లకు సంబంధించిన పత్రాలను అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వంగాల భగవాన్‌రెడ్డి, బరుపట్ల కిరీటి, బాలకృష్ణ, దేవేందర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పసిబాలుడిపై వీధికుక్క దాడి



తీవ్ర గాయాలపాలైన బాలుడు డేవిడ్‌రాజ్

కాజీపేట అర్బన్: వరంగల్ నగరంలో శనివారం 18 నెలల బాలుడిపై ఓ వీధి కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. వెంటనే బాలుడిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ వరంగల్ నగర పర్యటన రోజే ఈ ఘటన చోటుచేసుకుంది. కాజీపేట రైల్వే క్వార్టర్స్ ప్రాంతంలో వీధికుక్కల దాడిలో బాలుడు మృతిచెందిన సంఘటన మరవకముందే ఈ ఘటన జరగడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని రాజీవ్‌గృహకల్ప సముదాయంలో నివాసం ఉంటున్న మున్సిపల్ వాటర్‌మన్ మథ్యాస్, కళ్యాణి దంపతుల చిన్న కుమారుడు డేవిడ్ రాజ్ (18నెలలు) ఇంటి ఆవరణలో ఆడుకుంటున్నాడు. వీధికుక్కల గుంపు రాగా, అందులో ఓ కుక్క ఒక్కసారిగా బాలుడిపై విరుచుకుపడి ముఖభాగంపై కరిచింది. దీంతో కుడి దవడకు తీవ్రగాయమైంది. గమనించిన తల్లిదండ్రులు కుక్కను చెదరగొట్టారు. వెంటనే డేవిడ్‌రాజ్‌ను 108 వాహనంలో ఎంజీఎం తరలించారు. ఎంజీఎం వైద్యులు కుడి దవడ ఛిద్రం అవడంతో కుట్లు వేసి వారం రోజుల పాటు ఎంజీఎంలో చికిత్స పొందాలని తెలిపినట్లు డేవిడ్ రాజ్ తండ్రి మథ్యాస్ తెలిపాడు. కాగా పసిబాలుడిపై దాడి చేసిన కుక్క వెంట ఉన్న మిగతా కుక్కలు మరో ఇద్దరిపై దాడికి పాల్పడడంతో స్థానికులు గాయపరిచాయి. అందులో ఓ వీధికుక్కను కొట్టి చంపేశారు.

మున్సిపల్ శాఖ మంత్రి రాక రోజే ఘటన..

మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ శనివారం నగరంలో పర్యటించారు. ఆ సమయంలోనే రాజీవ్‌గృహకల్ప సముదాయంలో వీధికుక్కలు దాడి చేయడం తీవ్ర కలకలం రేపింది. మంత్రి.. మున్సిపల్ సిబ్బంది పనితీరుపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.

డ్యూటీ టైం అయ్యింది.. రేపొస్తాం!

బాలుడిపై కుక్కల దాడి నేపథ్యంలో మున్సిపల్ సిబ్బంది వాటిని పట్టుకోవడానికి వాహనంతో సహా వచ్చారు. 30 నుంచి 40 కుక్కలు రాజీవ్ గృహకల్పలో సంచరిస్తుండగా.. ఒక కుక్కను మాత్రమే సిబ్బంది పట్టుకున్నారు. 'మా డ్యూటీ టైం అయిపోయింది. రేపొచ్చి పట్టుకుపోతాం' అని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చి వెళ్లిపోయారు. దీంతో స్థానికులు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేయూలో కాంట్రాక్టు అధ్యాపకుల ధర్నా

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని కాంట్రాక్ట్ అధ్యాకుల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కేయూ పరిపాలన భవనం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్ మాట్లాడారు. తెలంగాణలోని యూనివర్సిటీల్లో పని చేస్తున్న 1335 మంది కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. ధర్నాలో జేఏసీ బాధ్యులు జరుపుల చందులాల్, నాగయ్య, మధుకర్‌రావు, శ్రీధర్‌రావు, లక్ష్మారెడ్డి, రఘువర్ధన్ రెడ్డి, చంద్రశేఖర్, మంజుల, కల్పన చీకటి శ్రీనివాస్, అనిల్‌కుమార్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని హనుమకొండలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ చైర్మన్ డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్, ఉమెన్స్ కన్వీనర్ మధుశ్రీ కలిసి వినతిపత్రం అందజేశారు.

అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం



ఆత్మకూరు : రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా తమ పార్టీ శ్రేణులను అక్రమంగా అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు అన్నారు. మండల కేంద్రానికి చెందిన అలువాల రవి, తనుగుల సందీప్, ఓబీసీ సెల్ జిల్లా కోఆర్డినేటర్ చిమ్మని దేవరాజు, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు రేవూరి జయపాల్‌రెడ్డి, వెల్దె వెంకటేశ్వర్లు, గుండెబోయిన శ్యామ్, బయ్య తిరుపతిలను పోలీసులు అరెస్ట్ చేయగా వాసు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులను అరెస్ట్ చేయకుండా బీఆర్ఎస్ నాయకుల సభలు నిర్వహించుకోవాలని హితవు పలికారు. ఈ సందర్భంగా అరెస్టైన నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఉపాధి కల్పించడమే ధ్యేయం



కాజీపేట: ఎస్సీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ రాష్ట్రంలో దళితబంధు పథకం ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కాజీపేట 47వ డివిజన్ బాపూజీనగర్ ప్రధాన రహదారిపై దళితబంధు వార్షికోత్సవ వేడుకలను శనివారం ప్రారంభించి లబ్ధిదారుడు గబ్బెట శ్రీనివాస్‌ను అభినందించారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్, నార్లగిరి రమేష్, దశరథం, అఫ్జల్, మర్యాల కృష్ణ, సిరిల్ లారెన్స్, పాస్టర్ మంద కుమార్, తండమళ్ల వేణు, బొల్లె కుమార్ పాల్గొన్నారు.

ఎన్నికలు సరికాదు



నయీంనగర్: హనుమకొండ జిల్లా హాకీ అసోసియేషన్ ఎన్నికలు సరికావని నయీంనగర్ హాకీ క్లబ్ సభ్యులు, క్రీడాకారులు అన్నారు. నయీంనగర్ హాకీ క్లబ్ క్రీడాకారులకు సమాచారం ఇవ్వకుండా అసోసియేషన్ ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఎన్నికలు నియమావళికి విరుద్ధంగా జరిగిన ఎన్నికలను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ హైదరాబాద్ హాకీ అసోసియేషన్‌ను కోరారు.

రెగ్యులరైజేషన్ చేయాలి

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని జేఏసీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మంత్రి కేటీఆర్‌ను కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల జేఏసీ కన్వీనర్ డాక్టర్ కరుణాకర్‌రావు, కన్వీనర్ డాక్టర్ సాధు రాజేష్, బాధ్యులు శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో డాక్టర్ బైరి నిరంజన్, డాక్టర్ ఫిరోజ్ పాషా, డాక్టర్ మామిడి లింగయ్య, డాక్టర్ చిర్ర రాజు తదితరులు ఉన్నారు.

ఉపాధికి ప్రభుత్వం పెద్దపీట



హసన్‌పర్తి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధికి పెద్దపీట వేస్తోందని ఎస్‌వీఎస్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు అన్నారు. భీమారంలోని ఎస్‌వీఎస్ కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను శనివారం నిర్వహించారు. కళాశాలలోని పలు విభాగాలకు చెందిన 51మంది విద్యార్థులు ఆయా కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారు. సోల్వో –క్యూలో 25మంది, టెక్నియాన్‌లో 16మంది, మోనోసేజ్‌లో 10 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు వివరించారు. ఈమేరకు వారికి నియామక పత్రాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సుశాంత్ పాల్గొన్నారు.

మనోధైర్యంతో క్యాన్సర్‌ను జయించాలి

● డాక్టర్ అవినాశ్ తిప్పని



మాట్లాడుతున్న డాక్టర్ అవినాశ్

దామెర : మనోధైర్యంతో క్యాన్సర్‌ను జయించాలని ప్రతిమ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ అవినాష్ తిప్పని ఆకాంక్షించారు. దామెర క్రాస్‌లోని ప్రతిమ ఆసుపత్రిలో నోటి, గొంతు కాన్సర్‌తో బాధపడుతూ ఆపరేషన్లు చేయించుకున్న బాధితుల్లో భరోసా నింపేలా, కొత్త పేషంట్లను చైతన్యవంతం చేసేలా అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు, ఈ సందర్భంగా డాక్టర్ అవినాశ్ మాట్లాడారు. పాత పేషెంట్లు కోలుకుంటున్న విధానాన్ని వివరించారు. ఆసుపత్రి ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు 35 మందికి నోటి, గొంతు ఆపరేషన్లు విజయవంతంగా చేసినట్లు తెలిపారు. వారు కోలుకుంటున్నట్లు చెప్పారు. కాన్సర్ బాధితులు అధైర్యపడకుండా డాక్టర్ల సలహాలు, సూచనలు పాటించి మహమ్మారిని తరిమికొట్టాలని కోరారు. అనంతరం హెడ్, నెక్ సర్జన్ డాక్టర్ అభినవ్, డాక్టర్ మద్ది రాహుల్ నారాయణ, రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ సమిత్ర పేషంట్లతో మాట్లాడి వారిలో భరోసా నింపారు.

నాణ్యమైన సేవలు అందించాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ

ఆత్మకూరు : విద్యుత్ ఉద్యోగులు వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ కన్జూమర్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ ఫోరం (సీజీఆర్ఎఫ్) చైర్మన్ పెరుమాండ్ల సత్యనారాయణ స్పష్టం చేశారు. మండల కేంద్రంలో పరకాల సబ్‌డివిజన్ పరిధిలోని నడికూడ, పరకాల, శాయంపేట, దామెర, ఆత్మకూరు మండలాలకు చెందిన వినియోగదారుల అవగాహన సదస్సును శనివారం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలు అక్రమంగా విద్యుత్‌ను వినియోగించుకోవద్దని చెప్పారు. మీటరు బిగించుకుని ప్రభుత్వం అందిస్తున్న 101 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యుత్ వినియోగదారులకు నిర్దేంచిన కాలంలో లోపాలు సరి చేయకపోతే చర్యలు తప్పవని ఉద్యోగులకు చెప్పారు. సేవల్లో లోపంపై ఫోరంకు ఫిర్యాదు చేస్తే విద్యుత్ సేవలు అందించడంతోపాటుగా వినియోగదారునికి జాప్యానికి పరిహారం చెల్లించేలా తీర్పు ఇస్తామన్నారు. ఇందు కోసం ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఫోరంకు లిఖిత పూర్వకంగా సాక్షాధారాలతో ఫిర్యాదు చేస్తే 45 రోజుల్లో పరిష్కరిస్తామని చెప్పారు. ప్రతినెలా లోక్ అదాలత్ ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. పెంచికలపేటలో రూ.1.5 కోట్ల వ్యయంతో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ మెంబర్ తిరుమల్‌రావు, ఫైనాన్స్ మెంబర్ చరణ్‌దాస్, ఇండిపెండెంట్ మెంబర్ నరేందర్, ఎస్ఈ వెంకటరమణ, టెక్నికల్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి విజేందర్‌రెడ్డి, డీఈ దేవేందర్‌నాయక్, ఏఈ రవికుమార్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న బుచ్చిరెడ్డి

శాయంపేట : భూపాలపల్లి నియోజకవర్గంలో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఐఎన్‌టీయూసీ మండల కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మారపల్లి రాజేందర్, ఉపాధ్యక్షుడిగా అక్కపాక రాజు, ప్రధాన కార్యదర్శిగా తప్పెట సురేందర్, కార్యనిర్వాహక కార్యదర్శిగా అడప కుమారస్వామి, ప్రచార కార్యదర్శిగా కోకిల రాజు, సహాయ కార్యదర్శిగా వడ్డేపల్లి మహేందర్, కోశాధికారిగా కౌటం లక్ష్మీనారాయణ, కార్యవర్గ సభ్యులుగా యార తిరుపతి, యాట సదానందం, రమేశ్, మామిడి శ్రీను, ముక్కెర సురేశ్, కరట్లపల్లి వీరన్న, బొమ్మకంటి రమేష్, సాదిక్, బాసాని శ్రీనివాస్, ఎడ్ల శరత్ ఎన్నికయ్యారు. అనంతరం బుచ్చిరెడ్డి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టారు. బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు ప్రణాళికాయుతంగా పని చేస్తే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు లడే రాజ్‌కుమార్, చింతల రవిపాల్, బాసాని మార్కండేయ, మారేపల్లి రాజు, మారేపల్లి కట్టయ్య పాల్గొన్నారు.

వెంచర్లకు రహదారి మట్టి తరలింపు



జేసీబీతో టిప్పర్‌లో మట్టి పోస్తున్న అక్రమార్కులు

దామెర : జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పాత రోడ్డును తవ్వగా వచ్చిన మట్టిని కొందరు వెంచర్ల యజమానులు అక్రమంగా తరలిస్తున్నారు. మండలంలోని దామెర క్రాస్ నుంచి గూడెప్పాడ్ క్రాస్ వరకు హైదరాబాద్–భూపాలపట్నం 163వ నంబర్ జాతీయ రహదారిపై నాలుగు లైన్ల పనులు కొనసాగుతున్న క్రమంలో పాత రహదారిని కాంట్రాక్టర్ తవ్వించి మట్టిని ఓగ్లాపూర్ సమీపంలోని పవర్ గ్రిడ్ పక్కనున్న ఖాళీ స్థలంలో కుప్పలుగా పోయించారు. కాగా సదరు మట్టిపై సమీపంలోని ఓ వెంచర్ యజమాని కన్నేశాడు. జేసీబీ, టిప్పర్లతో మట్టిని వెంచర్లకు తరలిస్తున్నాడు. ప్రభుత్వ అనుమతి లేకున్నా మట్టి తరలిస్తుండగా జాతీయ రహదారి సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయండి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హన్మకొండ అర్బన్: జిల్లాలో గోవధ నిషేధానికి కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమంగా, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న గో వధశాలలను తక్షణం మూసివేయాలని భారతీయ గోవంశ రక్షణ సంవర్ధన పరిషత్, విశ్వహిందూ పరిషత్ గోరక్ష విభాగం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కలెక్టరేట్‌లో శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వీహెచ్‌పీ వరంగల్ మహానగర కార్యదర్శి శ్రీరాం ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ గోవుల అక్రమ రవాణా విషయంలో ప్రభుత్వం, పోలీస్ శాఖలు కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఈ విషయమై పోలీస్ కమిషనర్ రంగనాథ్, మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషా, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు వినతిపత్రాలు అందజేసినట్లు వివరించారు. సంబంధిత శాఖలు స్పందించని పక్షంలో ఆందోళనలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు తాడిశెట్టి శ్రీధర్, జి.రాకేష్, ఆదిత్యసాయి, భజరంగ్‌దళ్ నాయకులు సుతారి సాయిరాం, తిరుపతిరెడ్డి, సాయినాథ్, హరీష్, అనుమాండ్ల శివకృష్ణ తదితరులు ఉన్నారు.